క్లుప్తంగా

ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ



మైలవరం: కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా మైలవరంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ శాంతియుతంగా క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నియోజవర్గ నాయకుడు ఇంకొల్లు జమలయ్య మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ర్యాలీ నిర్వహించామన్నారు. ఉగ్రమూకలను అణచివేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఇంకొల్లు జమలయ్య మాదిగ, ప్రత్తిపాటి ఏసు రత్నం, ఓలేటి ఏసు, యలవర్తి నాగరాజు, కొండల రామారావు, మట్టకొయ్య సుందరం, దూరు దాసు, బుద్దే యోహాను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడిగా నాగరాజు



జి.కొండూరు: వైఎస్సార్ సీపీ గుర్రాజుపాలెం గ్రామ అధ్యక్షుడిగా తమటం నాగరాజు నియమితులయ్యారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు, సర్పంచ్ తమటం వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నాగరాజుని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు నాగరాజుకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుర్రాజుపాలెం గ్రామ పంచాయతీలో టీడీపీ నుంచి ఏడో వార్డు మెంబరుగా గెలుపొందిన బలిపోలి వెంకటనారాయణ వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షురాలిగా లిల్లిమ్మ



మైలవరం: ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సందిపాము లిల్లిమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మహిళా హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన ఆమె గత 27 ఏళ్లుగా తెలుగు పండిట్‌గా జిల్లాలోని జి.కొండూరు, వత్సవాయి గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. తనకు పదవి ఇచ్చిన బుల్లా రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి జేఏసీ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వివిధ యూనియన్‌ల నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలో వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్, విలేజ్ వార్డు ఎంప్లాయీస్ ఫెడరేషన్, విలేజ్ వార్డు దివ్యాంగజన్ ఫెడరేషన్, తదితర యూనియన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేషన్ అర్హతతో సచివాలయాల్లో నియమించిన ఉద్యోగులకు నూతన వ్యవస్థ ద్వారా పదోన్నతులు, ఇతర బెనిఫిట్లు ఉండవన్నారు. సమస్యల పరిష్కారం కోసం జేఏసీగా ఏర్పడ్డారు. జేఏసీ చైర్మన్‌గా జి.అశ్వర్థప్ప, అధ్యక్షుడిగా తోటకూర కోటేశ్వరరావు, కన్వీనర్‌గా మన్నే రాజశేఖర్, కో-కన్వీనర్‌గా మీసాల రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై నృత్య కళాకారిణి నేతి రిషిత పర్యవేక్షణలో 15 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

‘సౌర వెలుగులు’ సాకారమయ్యేనా?

- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన
- 200 యూనిట్ల లోపు వినియోగదారులకు ప్రయోజనం
- దరఖాస్తు చేసుకున్నా ఏర్పాటు చేయని వైనం
- వేసవిలో ఏర్పాటు చేస్తే బిల్లుల భారం తగ్గే అవకాశం

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కోసం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ప్రతి నెలా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునే వారికి రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానల్స్‌ను ఉచితంగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. పథకం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ పథకం అమలుకు నోచుకోలేదు. రూ. రెండు లక్షల వ్యయంతో మూడు కిలోవాట్ల యూనిట్లకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.78 వేలు సబ్సిడీ అందుతుంది. 200 యూనిట్లు లోపు వాడే లబ్ధిదారులు వేసవిలో కూలర్లు, ఫ్యాన్లు, ఏసీ వాడకంతో కరెంటు బిల్లు తడిసి మోపెడవుతోంది. వేసవిలో ఉచిత పథకంలో సోలార్ పథకం అమలు చేస్తే కరెంట్ బిల్లుల భారం తగ్గుతుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.



కేతనకొండలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన నాలుగు కిలోవాట్ల సోలార్ ప్యానల్స్

పథకంపై ఎస్సీ, ఎస్టీల నిరాశ

నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు ఉచితంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. రూ.1.60 లక్షల విలువైన రెండు కిలో వాట్ల సామర్థ్యం గల సౌర పలకలు ఇళ్లపై ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖాధికారులు ఇప్పటికే గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈ పథకంలో నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పొందవచ్చు. ఇప్పటికే విద్యుత్ శాఖాధికారులు నిర్వహించిన సర్వేలో కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో 1931 మంది, ఇబ్రహీంపట్నం గ్రామీణ ప్రాంతాల్లో 3,152 మంది మొత్తం 5,081 కుటుంబాలకు ఈ పథకంలో లబ్ధి చేకూరనుంది. రెండు కిలోవాట్ల యూనిట్‌కు అయ్యే ఖర్చు రూ.1.60 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. పథకం ఇంకా అమలు కాకపోవడంపై ఎస్సీ, ఎస్టీల్లో నిరాశ నెలకొంది.

మూడు కిలోవాట్ల యూనిట్లు ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాల్టీలో గృహ యజమానులు స్తోమతను బట్టి మూడు కిలో వాట్ల సోలార్ యూనిట్ వైపు మొగ్గు చూపుతున్నారు. సోలార్ యూనిట్ ద్వారా వేసవిలో కరెంట్ బిల్లు తగ్గించుకోవచ్చనే భావన వారిలో ఉంది. సౌరశక్తి వినియోగం వలన పర్యావరణాన్ని కాపాడవచ్చు. సోలార్ ప్యానల్స్ అమర్చడం వలన ఇంటి విలువ కూడా పెరుగుతుందని యజమానులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో ఇప్పటికే సుమారు మూడు కిలోవాట్లు సామర్థ్యం గల 100 యూనిట్లు నెలకొల్పారు. సామాన్యులు మూడు కిలోవాట్ల ప్యానల్‌కు రూ.2 లక్షలు ఒకేసారి పెట్టుబడి పెట్టుకోలేక పోవడం, బ్యాంకులు కూడా సామాన్యులకు లోన్ మంజూరుకు ముందుకు రాకపోవడంతో ఉచిత సోలార్ పథకంపై ఎస్సీ, ఎస్టీలు ఆశ పెట్టుకున్నారు. రెండు కిలోవాట్ల ఉచిత యూనిట్లు వేసవిలోనే ఎస్సీ, ఎస్టీలకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉచిత సోలార్ పథకం అమలు చేయాలి



గత ఐదేళ్లుగా మా ఇంటికి 200 యూనిట్ల లోపే కరెంటు బిల్లు వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి కరెంట్ బిల్లును ప్రభుత్వమే భరిస్తోంది. 200 లోపు యూనిట్లు వాడే వారికి సోలార్ విద్యుత్ పలకలు అమర్చుతామన్నారు. ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. వేసవిలోనే ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– కోలకాని శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ప్రభుత్వం ప్రకటించినట్లు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ పథకం అమలుపై ఆదేశాలు రాలేదు. నగదు భరించగలిగిన వారికి మూడు కిలోవాట్ల ప్యానల్స్ బిగిస్తున్నాం. ఇప్పటికి 100 వరకు ఏర్పాటు చేశాం. రూ.78 వేలు సబ్సిడీ, బ్యాంకులు లోన్ ఇస్తున్నాయి. ఉచిత పథకంలో లబ్ధిదారులను గుర్తించాం. అనుమతి వస్తే వెంటనే అమలు చేస్తాం.

– వెంకన్నబాబు, విద్యుత్ ఏఈ, ఇబ్రహీంపట్నం

ప్రారంభం కాని ఉపాధి హామీ పనులు

నూజివీడు: పనులు లేని సమయంలో కూలీలకు పనులు కల్పించి ఉపాధిని అందించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ పథకం పనులు నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో నేటికి ప్రారంభం కాలేదు. దీంతో కూలీలు పనులు లేక ఇళ్ల వద్దే ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు. మండలంలోని సిద్ధార్థ నగర్, ముక్కొల్లుపాడు, మొర్సపూడి, మీర్జాపురం, సీతారామపురం, గొల్లపల్లి గ్రామాల్లో ఇప్పటికి కూడా ఉపాధి పనులు ప్రారంభం కాలేదు. ఈ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడం వల్ల పనులు ప్రారంభం కాలేదని తెలిసింది. ఈ గ్రామాల్లో పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీల కుటుంబాలు ఉన్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించడంలో అధికారులు విఫలం కావడం వల్లే పనులు లేకుండా పోయాయని కూలీలు ఆరోపిస్తున్నారు. మండలంలో రోజుకు ఐదు వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవ్వాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా 2,500 మంది మాత్రమే పనులకు వస్తున్నారు.

మత్స్యకారులకు సాయం రెట్టింపు

నూజివీడు: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థికసాయం రెట్టింపు చేసి నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుధాకర్, డి. సుదర్శన్ తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ సైన్స్, లెక్కలు, మ్యాజిక్‌షోలలో శిక్షణ ఇస్తామని చెప్పారు.

గ్రంథాలయాల్లో...

తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో, పెనుగొలను గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్లు పద్మావతి, శ్రీలత తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

- **మైలవరం:** మైలవరం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయ ప్రాంగణంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని శాఖా గ్రంథాలయాధికారి జె.నాగరాజు తెలిపారు. ప్రతి రోజూ పిల్లలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. శిక్షణా శిబిరంలో పిల్లలు కథలు వినడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్షలు, చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించడం, చిత్రలేఖనం తదితర విజ్ఞాన అంశాలపై ప్రసంగాలు ఉంటాయని వివరించారు.
- **జి.కొండూరు:** జి.కొండూరు గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి వి.విజయకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేసవి శిబిరంలో పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు, స్పోకెన్ ఇంగ్లీషు వంటి అంశాలపై పిల్లలకు శిక్షణ ఇస్తామని వివరించారు.

నూజివీడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి బి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. విజ్ఞాన పుస్తకాలు, కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, డ్రాయింగ్, పెయింటింగ్, పుస్తక సమీక్ష, క్యారమ్స్, క్విజ్, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు.

- **చాట్రాయి:** మండలంలోని చనుబండ గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ప్రతి రోజూ విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

మెరిట్ విద్యార్థినులకు సత్కారం



విద్యార్థినులను సన్మానిస్తున్న షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులను గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆదివారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కటుకూరి సన (540), సంగెపు స్నేహ (514), సంగెపు మౌనిక (501)లను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు వూటుకూరు నారాయణరావు, జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు మురళీకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, ఎన్వీ నరసింహారావు, రిటైర్డు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు శాలువాలతో సత్కరించి నగదు పురస్కారం అందజేశారు.



రేవతిని సన్మానిస్తున్న గ్రామస్తులు

టాపర్‌కు సన్మానం

చాట్రాయి: పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన పరసా రేవతిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నంపేటలో మండల టాపర్ రేవతికి నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని అభినందించారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌పై నిషేధం ఎత్తివేయాలి

సీపీఎం తిరువూరు పట్టణ కమిటీ డిమాండ్

తిరువూరు: తిరువూరు పట్టణంలోని శాంతినగర్, అశోక్‌నగర్, సుగాలీ కాలనీలలో వివిధ రకాల మాన్యం భూముల అమ్మకాలు, కొనుగోళ్లపై విధించిన నిషేధాన్ని ఎత్తి వేయాలని సీపీఎం తిరువూరు పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం పట్టణ పార్టీ సమావేశం కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాన్యం భూముల్లో నివేశన స్థలాల రిజిస్ట్రేషన్లు ఎంతోకాలంగా జరుగుతుండగా, గత 8 సంవత్సరాలుగా అమ్మకాలు, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్ ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్లు జరుగకపోవడంతో స్థల యజమానులు తమ కుటుంబ అవసరాల నిమిత్తం అమ్మకానికి వీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం వెంటనే నిషేధం ఎత్తేయాలని కోరారు.

మొక్కజొన్న సీడ్స్ రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్

మైలవరం: మొక్కజొన్న సీడ్స్ రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందరావు, పుల్లూరు మాజీ సర్పంచ్ బాణోతు రాము తదితరులతో కూడిన బృందం పుల్లూరు, సీతారామపురం తండా, బాడవ, మంగాపురం, చంద్రగూడెం, దాసుళ్లపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించింది. మొక్కజొన్న సీడ్ సాగు చేసి నష్టపోయిన రైతులను, కౌలు రైతులను వారు పరామర్శించారు. వారు నష్టపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యత లేని విత్తనాలు ఇచ్చి మోసగించిన విత్తన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందారావు మాట్లాడుతూ పలు విత్తన కంపెనీలు తమ ఆర్గనైజర్ల ద్వారా ట్రైల్ సీడ్ ఇచ్చి మంచి లాభాలు వస్తాయని, మొక్కజొన్న పండించాలని రైతులను ప్రోత్సహించారన్నారు. అనివార్య కారణాల వలన దిగుబడి తగ్గితే నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు రైతులు అడిగితే మొఖం చాటేస్తున్నారని తెలిపారు. నష్టపరిహారం చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మంగాపురంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

పేదల సంక్షేమానికి కృషి చేసిన దాసరి

వర్ధంతి కార్యక్రమంలో వక్తల నివాళి

నూజివీడు: బడుగు జీవుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను నిర్మించి అత్యంత విలువలతో కూడిన రాజకీయ ప్రస్థానాన్ని గడిపిన నిబద్ధతగల పోరాట యోధుడు దాసరి నాగభూషణరావు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. దాసరి నాగభూషణరావు 17వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన దిగవల్లిలో ఆదివారం దాసరి విగ్రహానికి వనజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పేదల జీవితాల్లో వెలుగులు చూడడం కోసం దాసరి పోరాటాలు, ఉద్యమాలు చేశారన్నారు. సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరావు, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, దిగవల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గుంటక ధర్మారెడ్డి, మిట్టగూడెం మాజీ సర్పంచ్ వెలివేల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నూజివీడు టౌన్ ఆధ్వర్యంలో స్థానిక అమర్ భవన్‌లో దాసరి చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, త్రివిధ స్కూల్ ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్, నాయకులు పల్లె ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



దిగవల్లిలో నివాళులర్పిస్తున్న అక్కినేని వనజ, కొమ్మన నాగేశ్వరరావు తదితరులు

● అపూర్వం.. ఆత్మీయ కలయిక

తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1998-2001 బీఏ పూర్వ విద్యార్థులు 24 సంవత్సరాల అనంతరం కలుసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం పేరిట జరిగిన కార్యక్రమంలో ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2005-2006 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, ముసునూరు జెడ్పీ హైస్కూల్ 2005-2006 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన పాఠశాలను, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు.

–తిరువూరు/ముసునూరు/ఆగిరిపల్లి



ఆగిరిపల్లి జెడ్పీ పాఠశాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ముసునూరు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

సకాలంలో గుర్తిస్తే కీళ్ల వ్యాధులు నయం

పటమట(విజయవాడతూర్పు): కీళ్లలో నొప్పిని తగ్గించుకునేందుకు కేవలం పెయిన్ కిల్లర్లను మాత్రమే మార్గమని భావించకూడదని, 80 రకాల కీళ్ల సమస్యలు ఉంటాయని, సమస్య ఎక్కడని గుర్తించాలని ప్రముఖ డాక్టర్ చెన్నుపాటి యోగిత అన్నారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం పటమటలోని వాసవ్య మహిళా మండలి మండపంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీళ్ల వ్యాధులను త్వరగా గుర్తిస్తే అదుపుచేయటం సులువన్నారు. షుగర్, బీపీ థైరాయిడ్‌లతో బాధపడేవారికి వచ్చే కీళ్ల సమస్యలను కూడా తగ్గించుకోగలిగిన వైద్య సదుపాయాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కీళ్ల వ్యాధిని అశ్రద్ధ చేస్తే లంగ్స్, మూత్రపిండాలను ప్రభావితం చేస్తుందని, 20 – 40 ఏళ్ల మధ్య స్త్రీలలో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని, ఇమ్యునిటీ, కీళ్ల సమస్యల వల్ల జ్వరం కూడా వస్తుందన్నారు. కండరాల వాపు ఎన్నో సమస్యలకు కారణమవుతుందని, వయస్సు మీరిన వారికి సాధారణమని, అధిక బరువు కూడా కీళ్ల సమస్యలకు కారణమని తెలిపారు. ఈ సందర్భంగా సమభావన మిత్రమండలి వ్యవస్థాపకులు ఎంఎస్ స్వామి శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ యోగితను సన్మానించారు. కార్యక్రమంలో సమభావన మిత్రమండలి అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, డాక్టర్ యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, బీసీహెచ్ వెంకటరెడ్డి, డాక్టర్ ఎంవీరావు, డాక్టర్ పీఆర్కే ప్రసాద్, పేర్లి దాసు, వెల్లంకి నాగభూషణం, లలిత తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ యోగితను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

బాల్యం నుంచే గ్రంథాలయాలపై ఆసక్తి పెంపొందాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాల్యం నుంచే పిల్లలు, విద్యార్థులకు చదువు, భాష, విజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించాలని, గ్రంథాలయాలకు వెళ్లే విధంగా కృషి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇటీవల కాలంలో పట్టణాల్లో కంటే గ్రామాల్లో గ్రంథాలయాలు ఎక్కువ మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో త్వరలో చారిత్రక గ్రంథాలయ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విజ్ఞానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆనాటి ప్రముఖులు గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపారని, కానీ నేడు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం నడపాల్సి వచ్చిందన్నారు. మాతృభాషా వికాసం కోసం ఈ వేదిక కృషి చేయాలని, ప్రజలను గ్రంథాలయాలు, పుస్తక పఠనం వైపు నడపాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రంథాలయాల కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలి..

వేదిక అధ్యక్షుడు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమం మొదలైన విజయవాడ కేంద్రంగా పునర్వికాస ఉద్యమం ప్రారంభమైందన్నారు. సమస్యలపై ప్రభుత్వానికి వినతి ఇవ్వడం, పరిష్కారానికి వత్తిడి చేయడం, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, మేధావులను సమీకరించి ముందుకు సాగుతామని వివరించారు. కర్ణాటక, కేరళ, అమెరికాలో మాదిరిగా మన రాష్ట్రంలో గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణులు రావి శారద, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు పెనుగొండ లక్ష్మీ నారాయణ, పాపినేని శివశంకర్, వెన్నా వల్లభరావు, దాసరి వెంకట రమణ,పి. సత్యవతి, మధురాంతకం రాజారామ్ మాట్లాడారు.

9 మద్యం బాటిళ్లు స్వాధీనం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషను పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం అనధికారిక మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గంపలగూడెం మండలం రాజవరంలో బలగాని వీరయ్య నుంచి 5 మద్యం సీసాలను, నెమలిలో కోట ఎలీసమ్మ నుంచి 4 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు.